# మెఱుపులు: మన పండుగలు

- వేమూరి వేంకట రామనాథం

మన పండుగలు కేవలం ఉల్లాసంతో గడపటానికి మాత్రమే కాదు. పండుగనాడు ప్రజ సంతోషం నిండిన మనస్సులతో ఉత్సహిస్తూ ప్రవర్తిస్తారు నిజమే. కాని ఆప్రత్యేక సందర్భాల వెనుక నున్న గంభీర భావం మనం తెలిసికొన గలిగితే, అది మనసులో నిల్పుకొనగలిగితే, ఆపండుగల ప్రాశస్త్యం మఱింతగా మనం గమనించి ఆనందించగలం.

ఈ ఊహతో వెనుక (జనవరి-ఫిబ్రవరి 2005 "తెలుగు జ్యోతి" సంచికలో) ఒక మారు "దీపావళి ఆంతర్యం" అన్న వ్యాసం ప్రచురించాను. దానికి సమానాంతరంగా, మఱికొన్ని విషయాలు చేర్చి యీవ్యాసం వ్రాస్తున్నాను, సాధ్యమయినంతవఱకు వెనుక చెప్పిన విషయాల పునరుక్తి లేనట్లుగా.

ఈవ్యాసంలో ప్రధానంగా సంక్రాంతి పండుగను తీసి కొంటాను. ఇందులో మహిషాసురుడనే దుర్మార్గుని చంపవలసిన అతిక్లిష్టకార్యం నిర్వహించబడవలసి వస్తుంది. వాని దౌర్జన్యధాటి ఎంత ఉధృతమైన దంటే, వానిని చంపటానికి త్రిమూర్తులలో ఏ ఒక్కరు ఉత్సహించక వారు ముగ్గురు తమతమ శక్తులను బ్రహ్మపరం చేయగా, అవి సంకలించి, ఆసృష్టికర్త ఒక మహా తేజస్విని యైన స్త్రీమూర్తిని సృష్టిచేశాడు. ఆదేవి అనంతశక్తి శాలిని. మహిషుని దౌర్జన్యాలను, కామవాంఛను చెండాడి వానిని అంతం చేస్తుంది ఆదేవి.

అయితే శుంభనిశుంభులనే అతి బలిష్ఠరాక్షసులు వెంటనే హింసాకార్యాలు చేయమొదలు పెట్టారు. వారిక్రౌర్యం, అసమంజస క్రియాకాండ దుర్భరమవటమే కాక, సులభంగా తొలగింప వీలులేనంత భయంకరంగా ఉంది. వారిని నిర్జించటానికి, దేవి తన శరీరం నుండి ఒక దివ్యస్వరూపం సృష్టించి వారి మీదకు ఉసురుకొలిపింది. ఆమెయే కాళి. కాళితాండవంలో ఆరాక్షసులు అంతమయినారు.

ఈ పూర్వకథలు ఎవరు విశ్వసించినా, ప్రధాన విషయమేమంటే మనం సంక్రాంతి పండువుగా సంబరపడే సన్నివేశం యొక్క మూలం దుర్మార్గాన్ని ఛేదించిన శిష్ట శక్తులను గూర్చి ఆనందపడటం, ఆశక్తులకు తగురీతిని మనం కృతజ్ఞతలు అందించటం - పూజా విధానాలలో. ఈ సంబరాలలో ఆలోచనాశక్తి యున్నవారికి స్ఫుటంగా స్ఫురిస్తుంది, చెడ్డపనులు దైత్యక్రమమని అవి అరికట్టటం దివ్యత్వమని. ఈ స్పృహ స్పష్టంగా మనసులో నాటుకొన్న వ్యక్తులకు అక్రమంగా దుష్కార్యాల యెడ అనిష్టము, సత్కార్యాల మీద మక్కువ వృద్ధి అవుతుంది.

మఱొక గమనార్హమైన విశేషమేమంటే ఈ కథలలోని రాక్షసులను సంహరించిన వారు స్త్రీలు! వారికి త్రిమూర్తుల శక్తి సామర్థ్యాలు తగురీతిని ప్రసాదింపబడతాయి. సృష్టిలోని పురుషులకు స్త్రీలకు విశిష్టమైన శక్తిసంపద కలదని, యిరుపక్షముల వారు అది పురస్కరించు కొని లోకకళ్యాణ ప్రదమైన కార్యాలు - ఎంతకష్టమైన వైనా - సాధించగలరని, దుర్మార్గం బాపి ప్రజలకు ఆనందం, శ్రేయస్సు కలిగించటంలో స్త్రీలు పురుషులకు తీసిపోరు, అన్నధ్వని, యీకథలలో ఉన్నది.

అంతేకాదు, మహిషాసురుని చంపినది త్రిమూర్తుల సామర్థ్యాలు కలిసి సృష్టి నందిన స్త్రీ. ఈఒక్కరు - ఆత్రిమూర్తులలో - ఈ బ్రహ్మాండ కార్యానికి ముందుకు రానట్లు, వారి ప్రత్యేక సామర్థ్యాలు ఆకార్యానికి చాలవన్నట్లు, అందువలన వారు ముగ్గురు తమ సమిష్టిప్రతాపంగా ఆశక్తిని సృష్టిచేశారన్నట్లు ఈ కథ కొంత సూచన చేస్తుంది. ఇతర పురాణకథలలో ఒక్క వ్యక్తి అతిబలవంతుడైన రాక్షసుని చంపలేదా, అని ప్రశ్నించటం సవ్యమేకాని, మనం జరిగినదని చెప్పబడిన కథకు అన్వయం మాత్రం సంకూర్చుకొన వలసియుంది. ఈ రాక్షసుడు అంత అసామాన్యబలం

కలవాడని, వానిని పోరులో నిర్జించటానికి ముమ్మ్వురుమూర్తుల బలప్రత్యేకతలు కలుపుకొన వలసిన అవసరం వారికి స్ఫురించింది, అని మనం కథా సందర్భం మననం చేసికోవాలి.

మఱొక పండుగను గూర్చి ముచ్చటించుదాం: వినాయక చవితి. ఇది మహారాష్ట్రవంటి ప్రాంతాలలో బ్రహ్మాండమైన ఉత్సాహముతో జరుపుతారు. మన ప్రాంతాలలో కూడ మనం చిన్నపిల్లలైనప్పటి నుండి ఈ పండుగకు ప్రత్యేకమైన ప్రాముఖ్యం ఉంది. విఘ్నేశ్వరుడు విఘ్నాలను అదుపుచేయగలవాడని ఒక విశ్వాసం ఉంది. ఏపని తలపెట్టినా, ముందు విఘ్నేశ్వరపూజ చేస్తారు. దీని భావం - జాగ్రత్తగా ఆలోచిస్తే - అతి సులభమైనది.

ఏపని అయినా సక్రమంగా ప్రారంభం చేయాలి, అని "సక్రమంగా" అన్న పదంలో ఉన్నది దాని "ఆంతర్యం" మానవుని జీవితంలో కావలసినది, చేకొన్న కార్యానికి తగిన అవలంబ మార్గాలు తెలిసికొని, అవి సకాలంలో ఆచరణలో పెట్టటం. ఈ చిన్నిసూత్రం విఘ్నేశ్వర పూజలో ఉంది. అంతేకాని, కేవలం ఉండ్రాళ్ళు తినడం కాదు.

మన మందఱు ఎఱిగిన ఒక విషయం ఇది: వినాయక చవితినాటి పూజా సందర్భంలో పిల్లలు తమ పుస్తకాలను - ముఖ్యంగా వారికి కష్టమైన చదువులకు చెందినవి - వినాయకుని ముందు పేర్చుతారు. ఆపూజ పూర్తి అయే వఱకు - బహుశః మఱొక రోజు దాక - ఆపుస్తకాలను అలాగే ఉంచుతారు. ఆపైని అవి తీసుకొని మామూలు పుస్తకం బొత్తిలో చేరుస్తారు. ఇందులోని మూలభావం ఏమంటే, ఆపిల్లలకు వెంటనే చదువు బాగా వస్తుందని కాదు; వారి బుద్ధి భగవంతుని మీద ప్రసరింపబడి, భగవంతుని కరుణ లభ్యమయ్యే రీతిని తాము అనుసరించవలెనని ఉత్సహిస్తారు. ఈ చిన్ని సూత్రం వారికి నచ్చచెప్పవలసియుంది.

ఇలాంటిదే మఱొక - పూజకాదు - ప్రార్థన ఉంది. "తల్లీ నిన్ను తలంచి పుస్తకము చేతన్ బూనితిన్" అంటూ సరస్వతీమతల్లిని ప్రార్థిస్తారు. ఈ పద్యం క్షుణ్ణంగా చదివి నంతమాత్రాన ఆపిల్లలకు చదువు బ్రహ్మాండంగా అబ్బుతుందని కాదు, ఈ విధమైన దైవ (దేవీ) ప్రార్థనతో వారి మనస్సు చక్కగా చదువుకొనే మార్గంలో సంచరిస్తుందని పెద్దల ఊహ.

మన పండుగలలో - ముఖ్యంగా దసరా, సంక్రాంతులలో కృష్ణుడు గీతలో వాక్రుచ్చిన ధర్మ సంస్థాపనార్థాయ, వినాశాయచ దుష్కృతాం అన్న అభయ వాక్యం ధ్వనిస్తుంది. ఈ సత్కార్యాలకు స్త్రీమూర్తులు నాయకత్వం వహించినట్లు ఈ కథలలో ఉన్న ముఖ్య విషయం ఏమంటే మన ప్రధానమైన పండుగల మూలవిశేషం దుష్టులపై దాడి. చెడును అడచి, మంచిని పెంచవలె నన్న ప్రధాన నీతి వాటిలో ఉంది. పండుగ అనగానే ఏదో "సరదా" అని, చక్కని ప్రసాదం, భోజనం గొట్టుతాయని (ముఖ్యంగా పిల్లలు ) అనుకొన్నా, ఈ అంతర్గతమైన విశేషం వారికి అర్థం అయే విధంగా పెద్దలు చెప్ప వలసియుంది. దసరావేళపిల్లలు "విల్లంబులు" పట్టుకొని ఆడు కుంటారు; దీపావళి వేళ బాణసంచా కాల్చి ఎంతో తృప్తి చెందుతారు.; కాని, ఆపండుగలలో గల స్థూలభావం వారికి - సులభభాషలో తెలియజేయాలి. ఇది పెద్దలకున్న విధి - వారి కది పూర్తిగా అవగతం అయిఉంటే!